# మట్టి పరిమళం తెలిపిన 'గట్టిగింజ'

***1975లో హైదరాబాద్ నుంచి "కొత్తబాట"*** అనే వారపత్రిక వచ్చేది. మిత్రుడు ఆర్వీ రామారావు అందులో పని చేస్తుండేవాడు. నాబోటి కుర్ర కవులం అడపాదడపా చెయ్యిచేసుకుంటూ వుండే వాళ్ళం. అదే పత్రికలో ఓ కడప రెడ్డిగారు శరపరంపరగా కథలు రాస్తూండేవారు. ఆయన సీనియర్ కవి. అప్పటికో ఓ అరడజను కావ్యాలు అచ్చువేసి వున్నారు. మాగురువు గజ్జెల మల్లారెడ్డికి ఆయన బాల్యమిత్రుడు. మేం గాఢంగా అభిమానించే మార్క్సిస్టు మేధావి రాచమల్లు రామ చంద్రా రెడ్డిగారికి సన్నిహిత మిత్రులు. ఆయన మా రచనల మీద ఓ కన్నేసేవుంచారని మాకు తెలియదు! అయినా, ఆరోజుల్లోనైనా, ఈ రోజుల్లోనైనా కవిప్రాయులకు ఇ తరుల్ని పట్టించుకునేంత తీరికెక్కడిది? అంతలో, ఓ రోజున నాకాయన కడపలో తారసపడ్డారు. మిత్రుడు శశిశ్రీ ఆయనకు నన్ను-నా కేరాఫ్ ఎడ్రస్‌తోసహా-పరిచయంచే శాడు. ఆయన దాన్నేమాత్రం పట్టించుకోకుండా, "ఈయప్పేగదో, అంగోలా లీడర్ నేటోగురించి 'కొత్తబాట'లో రాసిందేది? బాగ రాసినావప్పా! మీటర్ జమ్మని నడిపించిం దావ్!!" అని నవ్వుమొహంతో అన్నారు. కుర్ర కవులకు అంతకన్నా కావలసిందేముంది? దానికే కడుపు నిండిపోయింది! కానీ అంతటితో విందుభోజనం అయిపోలేదు- నన్నూ శశిశ్రీనీ వెంటబెట్టుకుని ఆయన తమ 'స్వామి' పుట్టపర్తి నారాయణాచార్యుల వారింటికి బయల్దేరారు. అక్కడ కూడా నేటో గురించిన కవితను ప్రస్తావించి సరస్వతీ పుత్రుల ఆశీర్వాదం కూడా అయాచితంగా నాకు దయశాయించారు! ఆయనే యెమ్మనూరు చిన్న వెంకటరెడ్డి అనే వై.సి.వి- నిలువెత్తు కడపదనం!!

వై.సి.వి. రెడ్డిని నేరుగా తెలిసివున్నవాళ్ళు వందలాదిగా వుంటారు. కడప జిల్లాకు ఓ కొసన, అనంతపురం జిల్లాకు ఆనుకునివుండే మండలం పులివెందుల. అందులో చిన్నవూరు బోనాల. అక్కడ ఓ రైతుకుటుంబంలో పుట్టిన వై.సి.వి. మెట్రిక్ పాసయి, జిల్లాబోర్డులో కొన్నాళ్ళు ఉద్యోగం కూడా చేశారు. అయితే, ఆది నుంచీ వామపక్ష ఉద్యమ అభిమానిగా వున్న వై.సి.వి.ని కడప పెత్తందార్లు ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోనివ్వలేదు. దాంతో, కొలువుకు స్వస్తిచెప్పి సాహిత్యమే జీవనంగా మను గడ సాగించారు వై.సి.వి. మొదట్లో కవిగానూ, చివరిరోజుల్లో కథానిక రచయితగానూ వై.సి.వి. రాష్ట్రమంతా సుప్రసిద్ధులయ్యారు. ***'తొలకరి చినుకులు', 'మేనక', 'రంభ', 'దక్షిణానిలము', 'రాయబారం'*** కవితాసంపుటులూ, ***'గట్టిగింజలు'*** కథానికా సంకలనం వెలువరించారు వై.సి.వి. అభ్యుదయ సాహిత్య విమర్శను మేలి మలుపు తిప్పిన ***'సంవేదన'*** త్రైమాసికకు -యుగసాహితి తరఫున- ప్రచురణకర్తగా వ్యవహరించిన అభ్యుదయ రచయిత వై.సి.వి.ని తెలిసినవాళ్ళే వేలాదిగా వుంటారు! అయితే, 1989 లో పి.రామకృష్ణారెడ్డి -వై.సి.విని తలచుకుంటూ రాసిన వ్యాసంలో- అన్నట్లు ***'తన రచనలకన్నా తనే అపురూపమైన మనిషి'*** వై.సి.వి. అందుకే, ఆయన్ని నేరుగా తెలిసిన వాళ్ళకు వై.సి.వి. పేరెత్తగానే ఆయన నిష్కారణ ఆదరణ, నిర్మమత్వం నిండిన ఆత్మీయత, నిర్మలమైన ప్రేమాభిమానాలే గుర్తుకొచ్చి బాధపెడతాయి. ఆయన వ్యక్తిత్వం, సాహిత్య మూర్తిమత్వం కన్నా ఎన్నోరెట్లు గొప్పదనిపిస్తుంది, ఒక్కోసారి! అయినప్పటికీ, సాహిత్య చరిత్ర వై.సి.వి.ని కవిగానే గుర్తుంచుకుంటుంది- అది సహజం, అదే న్యాయం కూడా!

ఇరవై దశకంలో పుట్టిన వై.సి.వి. ఆ తరానికి వుండిన లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్నారు. తెలుగుజిల్లాల్లో విద్యావ్యాప్తికి చొరవ మొదలైన కొత్తలో ఈ తరం ఓనమాలు దిద్దింది. పందొమ్మిదో శతాబ్ది మధ్యలో పునరుజ్జీవన ఉద్యమాలుగా మొదలైన సంఘసంస్కరణ యత్నాలు 1920 నాటికి ఊపందుకున్న స్వాతంత్ర్య సమరంలో లీనమయ్యాయి. అప్పటివరకూ అనేక ప్రాంతాల్లో విద్యావ్యాప్తికోసం విడివిడిగా జరుగుతూ వచ్చిన ప్రయత్నాలకు అలా ఓ జాతీయ స్వభావం ఏర్పడింది. అవే రోజుల్లో జాతి పునర్నిర్మాణంపై అంతర్జాతీయ స్థాయిలో జరిగిన చర్చల్లో విద్యదే పెద్దపీట! అలాంటి నేపథ్యం ప్రభావంతోనే ఆ తరంలో చదువంటే పుస్తక పఠనం మాత్రమే కాదనే చైతన్యం రూపుదిద్దుకుంది. కళలన్నీ విద్యలేననే సంవేదన కూడా అప్పట్లోనే బలపడింది. అదంతా, ఆ తరం రూపుదిద్దుకునే క్రమాన్ని ప్రభావితం చేసింది. వృత్తి ఉద్యమ కారులనూ, అధికార యంత్రంలో మర మేకులుగా ఉపయోగపడే ఉద్యోగులనూ తొలిసారి 'ఉత్పత్తి' చేసింది బహుశా ఈ తరమేనేమో! ఇది భారతదేశానికే పరిమితమైన పరిణామం కాదు. మన దేశంతో సహా, ప్రపంచం ఇవాళ ఇలా వుండడానికి ప్రధానమయిన కారకులు ఈ రెండు రకాల మనుషులే! ఆఫ్రోఆసియన్ దేశాల్లో 'ఆధునిక' చరిత్రకు కచ్చితమయిన రూపం ఇచ్చింది కూడా ఈ తరమేనేమో! ఆ తరంలో భాగంగా వున్నవాళ్ళందరిపైనా పడిన ఈ ప్రభావాలు వై.సి.వి. ఒక్కర్నే వదిలేస్తాయా?

వై.సి.వి.తన తరంలోని ప్రముఖ రచయితలు చాలామంది మాదిరే తానూ పద్య కవితతోనే గొంతు సవరించారు. అలా జరగడానికి కొన్ని కారణాలున్నాయి. కడపకు కొన్ని విశిష్టతలున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి కడపజిల్లాలో సంప్రదాయ సాహిత్యానికి దక్కిన అసాధారణ ఆదరణ వెనక కొన్ని విశేష కారణాలే వున్నాయి. సుసంపన్నమయిన సాహిత్య-చారిత్రక నేపథ్యాల సంగతి అటుంచండి; స్వాతంత్ర్యం వచ్చేనాటికి, దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్య, కడప జిల్లా కవిత్రయంగా ఓ వెలుగువెలుగుతున్నారు. (వాళ్ళు ముగ్గురిలో చివరివారైన పుట్టపర్తి ఆధునికత-సాంప్రదాయికతల మేలు కలయిక; అది వేరే విషయం!) ఈ కవిత్రయం ప్రభావం అప్పుడే కలంపట్టిన కవికుమారులపై పడడం సహజం! బహుశా ఆ ప్రభావం చేతనే ఆ నాటి యువకవులు పద్యాలు రాశారు. ఈ పరిస్థితి యాభై దశకం వరకూ కొనసాగింది. పద్యంస్థానంలో, మాత్రాబద్ధ గేయం వచ్చి చతికిలబడింది-అంతే తేడా! ఇదే మనకు వై.సి.వి. సాహిత్య పరిణామక్రమం లోనూ కనిపిస్తుంది! గమనించాల్సిన విషయం ఏమిటంటే, 1953లోనే వై.సి.వి.వెలువరించిన 'తొలకరి చినుకులు' పద్యకావ్యంలో ఆయన వ్యక్తంచేసిన అభిప్రాయాలు సాంప్రదాయిక రూపాన్ని ప్రతిబింబించినా, సాంప్రదాయిక తత్వాన్ని మాత్రం ప్రతిధ్వనించడం లేదు! అంతకు ముందటేడాది, తెలుగు జనం "ఎగరేసిన ఎర్రని జెండా" చాయ ఈ పద్యాల మీదకీ పాకినట్టుంది! ***'బీదసాదల నెత్తురు పిండి, పిండివంటలం జేసి, తిని త్రేచు భాగ్యవంతులేడ? ఆకలి డొక్కలు మాడి చచ్చు అనదలేడ? మరెట్టులీ శని నశించు??'*** అనిఅడిగిన కవి భాష పాతకాలానిదేకానీ భావనలో కొత్తదనం తొంగిచూస్తోందని అర్థమవడం లేదూ? అయితే, ఇంత చిన్నపద్యంలో కూడా నాలుగు అరసున్నల్నీ, ఓ బండిరానూ ఉదారంగా వెదజల్లడం చూస్తే, అప్పటికి ఈ అభ్యుదయ కవి పరిణామం ఇంకా ఓ కొలిక్కి రాలేదని కూడా అర్థమవుతుంది! ఏ మార్పూ రాత్రికి రాత్రి వచ్చిపడదు మరి!!

వై.సి.వి. చురుగ్గా రాస్తూండినంత కాలం గ్రామీణ ఆర్థికరంగంపై ప్రయోగాలు సాగుతూనేవున్నాయి. (ఇప్పుడేవో ఆగిపోయాయని కాదు!). మన ప్రణాళికల్లో వ్యవసాయంపై కురిపించిన తేనెజల్లులు రైతుజీవనం చేదువిషంగా మారకుండా ఆపలేకపోయాయి. పేదరికం ఘనీభవించివుండే పల్లెల్లో, ముఖ్యంగా దళితవాడల్లో, దాని వికృత స్వరూపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఏ రచయితనయినా అది కదిలించకుండా వుండదు. వై.సి.వి. పద్యాలన్నింటా, కష్టాలు అనుభవించేవాళ్ళ పట్ల కనికారం స్ఫుటంగా కనిపిస్తూ వుంటుంది- అయితే, కష్టజీవుల తరఫున బేషరతుగా వకాలతు తీసుకోవడం మాత్రం ఆయన కథల్లోనే కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది! ఆయన కథల్లో

ఎక్కువ భాగం 'కొత్తబాట' పత్రికలోనే వచ్చినట్లు గుర్తు. కడపలో గడపగడపకూ ఓ కథకుడు కనిపిస్తారు. ఆ ప్రాంతంలో కథానిక అంతటి ఆదరణకు పాత్రం కావడానికి ప్రత్యేకమయిన కారణాలేవో వుండేవుంటాయి. వాళ్ళలో చాలామంది గొప్ప శిల్పులు! రాష్ట్రం మొత్తంమీద గౌరవాదరాలు పొందినవాళ్ళు. రాచమల్లు రామచంద్రా రెడ్డి, సొదుం జయరాం, కేతు విశ్వనాథ రెడ్డి, పి.రామకృష్ణ, దాదా హయాత్, సత్యాగ్ని తదితరుల పేర్లు ప్రత్యేకం గుర్తుకు తెచ్చుకోనవసరం లేదు! వాళ్ళందరికీ భిన్నమయిన ఓ లక్షణం వై.సి.వి. కథల్లో కనిపిస్తుంది. ఆయన రచనల్లో, ముఖ్యంగా కథానికల్లో, మట్టిపరిమళం ప్రతి మాటలోంచీ వెలువడుతూంటుంది! పల్లెల్లోని బీదాబిక్కీ జీవితాలతో వై.సి.వి.కి వున్నంత ప్రగాఢమైన పరిచయం, లోతయిన అవగాహన మధ్యతరగతి రైతుల్లో చాలా మందిలో కనిపించదు. ఆ పరిచయం ప్రాతిపదికగా రాసిన కథలే, ***'గట్టిగింజలు'*** సంపుటిలో కనిపిస్తాయి. వై.సి.వి. కథల్లో స్త్రీలపట్ల, మగమహారాజుల చేతుల్లో వాళ్ళు పడే బాధల పట్ల వ్యక్తమయ్యే సహానుభూతి తీవ్రత కూడా ఇతరత్రా అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. ***'నగు మోము గనలేని', 'ఆస్తి విలువ'***లాంటి కథలు రాయాలంటే సహానుభూతి తీవ్రత ఒక్కటే చాలదు. బాధితుల తరఫున వాదించాలనే పట్టుదల లేకుండా ***'కుట్రల్లో కూలోడు', 'ఇంటి మాదిగోడు'*** కథలు ఎవరూ రాయలేరు. వై.సి.వి. రెడ్డి మొదట్నుంచీ కథానికల పైనే దృష్టిపెట్టి వుంటే మరిన్ని, మరింత మంచి కథలు వచ్చివుండేవికదా అనిపిస్తుంది ఒక్కోసారి!

000